# జ్యోతిషం ఆధారం

(గల్పిక)

గంగదేశం వాళ్ళకు గంగపురాణం ఉన్నది. అదే వాళ్ళకు చరిత్రా, పవిత్ర గ్రంథము కూడానూ. గంగ ఆ దేశానికి మూలదేవత. ముప్ఫైఏళ్ళ క్రితం దాకా గంగనుగురించి అంతగా ఎవరూ పట్టించుకోలేదు. గంగకు భర్తలేదనీ, అనేకమంది భర్తలున్నారనీ, పిల్లలున్నారనీ, లేరనీ, గంగ అంటే సీత అనీ, కాదు లక్ష్మీదేవి అనీ, భయంకరమైన వ్యాధులకు మూలదేవత అనీ, ఆరోగ్యాన్నీ, దీర్ఘాయువునూ ఇచ్చేదనీ, రకరకాల నమ్మకాలు ప్రజలలో ఉండేవి. చదువుకున్నవాళ్ళు ఏదీ నమ్మేవాళ్ళు కారు.

అయితే గంగదేశంలో రాజకీయ-సామాజిక పరిస్థితి అధ్వాన్నమైనది మొదలు గంగపురాణం గురించి అందరికీ వల్లమాలిన ఆసక్తి పుట్టుకొచ్చింది. అన్ని పురాణాలలాగే దాన్నికూడా వ్యాసుడు రాశాడన్నారు. అందులో ధూమశకటాలూ, ఆకాశ శకటాలూ ఉన్నాయి. ద్వాపరయుగంలో అవి ఉన్నాయని శాస్త్రిలుగార్లు వాదించారు.

గంగ పుట్టినరోజూ, నక్షత్రమూ, తిథీ, ఘడియా గంగపురాణంలో వ్యాసులవారు ఇచ్చారు. దాన్నిబట్టి అంచనా వెయ్యగా గంగ 39,542ఏళ్ళ క్రితం పుట్టిఉండాలి; లేదా 3,954 ఫిబ్రవరి 5 న అయినా పుట్టబోతుంది. గంగపురాణం భవిష్యపురాణం కాదు గనక పాత తేదీ ఖాయంచేసి, గంగ నివసించిన ఏడంతస్తుల మేడకోసం త్రవ్వకాలు ప్రారంభించారు.

"ఈ దెబ్బతో గంగసంగతి అటో ఇటో తేలుతుంది," అన్నారు గంగ మేధావులు. కాని అది నిజంకాదు. గంగపురాణానికున్న పవిత్రత ఆర్కియాలజీకి ఎక్కడిది?

*కొడవటిగంటి కుటుంబరావు*